క్లుప్తంగా

సన్మానం


ఆర్యవైశ్యులను సన్మానించిన నిర్వాహకులు

కలసపాడు : కలసపాడు మండల ఆర్యవైశ్యులను శుక్రవారం కడపలో ఘన సన్మానంగా సన్మానించారు. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి కుంభాభిషేకంలోఆర్యవైశ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలసపాడు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి సుదర్శన్, మండల అధ్యక్షుడు గొంట్లా రామాంజనేయులు, కోశాధికారి చాటకొండు వెంకటసత్యనారాయణ, సహాయ కార్యదర్శి జక్కాసుధాకర్, కమిటీ సభ్యులు తుమ్మలపెంట శ్రీహరి, మాజీ అధ్యక్షుడు భవనాసి పూర్ణచంద్రరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్యులను కడప ఆర్యవైశ్యులు ఘనంగా సన్మానించారు.

19న ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాత మార్కెట్‌లోని శ్రీలలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 19న ఆలయ 30వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. రతనాల వేంకటేశ్వరస్వామికి, స్వామి చెల్లెలు లలితాదేవికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించనున్నారు. ఉదయం 10 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు సామూహికంగా స్వామివారికి కుంకుమార్చన నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆలయ ట్రస్టు కమిటీ ప్రతినిధులు కోరారు.

నివాళి


శివానందరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

కలసపాడు : మండలంలోని మహానందిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బిజివేముల పుల్లారెడ్డి కుమారుడు స్టాఫ్‌వేర్ ఉద్యోగి బిజివేముల శివానందరెడ్డి బెంగళూరులో రైలు కిందపడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి శుక్రవారం మహానందిపల్లెలో శివానందరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పుల్లారెడ్డిని ఓదార్చి ధైర్యంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకన గురివిరెడ్డి, సూదా రామకృష్ణారెడ్డి, సుదర్శన్, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, దేవసాని శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకం లాభదాయకం


మాట్లాడుతున్న ఏపీ జయలక్ష్మి

కాశినాయన : రైతులకు పండ్ల తోటల పెంపకం లాభదాయకంగా ఉంటుందని ఎంపీడీఓ మైథిలి, ఏపీ జయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో పండ్ల తోటల పెంపకంపై ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలపై గ్రామసభ నిర్వహించారు. గంగనపల్లె గ్రామసభలో వారు మాట్లాడుతూ సొంత భూమి కలిగిన ప్రతిజక్కరు పండ్లతోటల పెంపకానికి అర్హులని అన్నారు. ఈ నెల 23వ తేదీ లోపల దరఖాస్తులు ఉపాధి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాలను ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ ఫీల్డ్‌అసిసెంట్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వ్యవసాయ సహాయకులు, ఉపాధి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కరుణించమ్మా.. కనకదుర్గమ్మా

బద్వేలు అర్బన్ : కరుణించమ్మా.. దుర్గమ్మా అంటూ అమ్మవారిని భక్తులు వేడుకున్నారు. స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్ ఆవరణలోని సబ్‌జైలు సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారి జన్మనక్షత్రం మూలనక్షత్రం సందర్భంగా శుక్రవారం అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన సుప్రభాతసేవ, పంచామృతాభిషేకంలో మహిళలు పాల్గొన్నారు. అలాగే కనకదుర్గమ్మ అమ్మవారికి మామిడికాయలతో నిర్వహించిన అలంకారం భక్తులను ఆకట్టుకుంది. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రదీప్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పశువుల ఎరువు.. ధరల దరవు

- ట్రాక్టర్ ట్రిప్పు రూ.5 నుంచి 7 వేలు
- పసుపు పంటకు మేలు
- పాడి రైతుల నుంచి కొనుగోలు
- ఖర్చు పెరిగినా పంట దిగుబడిపై అన్నదాతల ఆశలు


ట్రాక్టర్‌లో పేడ ఎరువును తరలిస్తున్న రైతులు

చాపాడు : మారుతున్న కాలానికి అనుగుణంగా అన్నదాతలో కూడా మార్పు వస్తోంది. భూసారం.. ప్రజా ఆరోగ్యం రక్షించుకోవడానికి.. పంట పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవడానికి వారు సేంద్రియ సాగు వైపు అడుగులు వేస్తున్నారు. అన్నదాతను ఆర్థికంగా గట్టెక్కించాలని వ్యవసాయశాఖాధికారులు తగు సూచనలు సలహాలు ఇస్తూ సేంద్రియ ఎరువులను వాడాలని ప్రోత్సహిస్తున్నారు. రైతులు సేంద్రియ ఎరువులను వాడేందుకు ఆసక్తి కనపరుస్తున్నారు. మైదుకూరు నియోజకవర్గంలో అత్యధికంగా ప్రతి ఏటా పసుపు పంటను సాగుచేస్తున్నారు. అయితే పసుపు విత్తనానికి తెగుళ్లు, వైరస్ సోకకుండా ఈ ఆర్గానిక్ ఎరువు కాపాడుతుంది. దీంతో ఎరువు ధరలు ఆకాశానంటుతున్నాయి. ఇది రైతుకు భారమైనప్పటికీ పసుపు సంప్రదాయ పంట కావడంతో రైతు ఎంతైనా సరే కొనుగోలు చేస్తున్నారు. పశువుల, మేక, గొర్రెల పేడలు పొలాలకు తోలుతున్నారు. పశువుల పేడలేని రైతులు పాడి ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. త్వరలోనే రబీ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతాంగం వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతారు. ఈ క్రమంలో రసాయన ఎరువుల కంటే ప్రకృతితో లభించే జీవ ఎరువులను (పేడ ఎరువును) పొలాల్లో వేసుకుంటున్నారు.

రసాయనిక ఎరువులతో పెరిగిన పెట్టుబడి

పశువుల పేడకు మైదుకూరు నియోజకవర్గంలో డిమాండ్ ఏర్పడింది. పాడి రైతులు, ఎద్దులు కలిగిన రైతులు నిల్వ చేసుకునే పేడ ఎరువును పొలాల్లో సత్తువలాగా వేసుకునేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. పాడి సంపద లేని వారు, పేడ కోసం పాడి రైతులను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో రైతుల కంటే ముందుగా దళారి వ్యాపారులు పాడి రైతుల వద్ద పేడ ఎరువును కొనుగోలు చేసి రైతులకు అధిక ధరకు విక్రయిస్తున్నారు. రసాయనిక ఎరువుల ధరలు రోజురోజుకు అమాంతంగా పెంచేస్తున్నారు. దీంతో రైతులు రసాయనిక ఎరువులకు అధిక ఖర్చు చేయాల్సి వస్తోంది. పెట్టుబడి ఖర్చు కూడా రానురాను పెరిగిపోతోంది. రసాయనిక ఎరువులు వాడకం వల్ల చీడపీడలు సోకి పంట దిగుబడి తగ్గిపోతోంది. ఈ విషయాన్ని రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తెలియచేయడంతో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి.. సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులు మొగ్గుచూపుతున్నారు.

ఆసక్తి చూపుతున్న రైతులు

పేడ ఎరువును పసుపు సాగు చేసుకునే రైతులు తమ పొలాల్లో చల్లుకునేందుకు చాలా ఆసక్తి కనబరుస్తున్నారు. ఏటా జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో పసుపు విత్తనం వేస్తారు. ఇప్పటికే పసుపు సాగు చేసే రైతులు విత్తనం పసుపును మండె కట్టి సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలో భూమిలో విత్తు సమయానికి పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో పొలంలో ముందస్తుగా పేడ ఎరువును చల్లుకుంటారు. ఎకరా పొలానికి మూడు ట్రాక్టర్ల పేడ ఎరువును వేస్తారు. ట్రాక్టర్ పేడ ఎరువు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకూ పలుకుతోంది. మైదుకూరు నియోజకవర్గ పరిధిలో ప్రతి ఏటా రైతులు పసుపు సాగు చేస్తారు. చాపాడు, దువ్వూరు, ఖాజీపేట, మైదుకూరు మండలాల్లో పాడి రైతుల వద్ద ఉండే పేడ ఎరువును వ్యాపారులు రూ.2–3 వేలకు కొనుగోలు చేసి దాన్ని వ్యవసాయ రైతులకు దూరాన్ని బట్టి రూ.5 నుంచి 7 వేలకు విక్రయిస్తున్నారు. పసుపు విత్తనం వేసే సమయానికి పేడ ఎరువు పొలం వేస్తే పంట విత్తనం దశ నుంచి బాగా వస్తుందని రైతులు భావిస్తారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రొద్దుటూరు : స్థానిక సుందరాచార్యుల వీధి, మసీద్ వీధిలలో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీజీ శ్రీనివాసులు రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గంగమ్మ దేవాలయం ట్రాన్స్‌ఫార్మర్ పాత ఐరన్ డబల్ పోల్ స్ట్రక్చర్ స్థానంలో నూతన పీఎస్‌సీసీ డబల్ పోల్ స్ట్రక్చర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు మండల పూజ

మైదుకూరు : మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లంపల్లెలో నిర్మించిన సీతారామ లక్ష్మణ హనుమ ఆలయంలో శనివారం మండల పూజ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా సేద్యపు ఎద్దులతో బండలాగుడు పోటీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోటీలో గెలుపొందిన వృషభాల యజమానులకు రూ.50,116, రూ.40,116, రూ.30,116, రూ.20,116, రూ.10,116 బహుమతులు అందజేస్తామని వివరించారు. కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

రాజుపాళెం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రాజుపాళెం మండలంలోని వెల్లాలలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలు శుక్రవారం ధ్వజా అవరోహనంతో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. స్వాములకు అభిషేకం, సహస్రనామార్చన, ఆకుపూజ, కుంకుమార్చనా, మహా మంగళహారతి వంటి పూజలు చేశారు. ఆలయ ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ రెడ్డి, భక్తులు స్వాములను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

డాక్టరేట్ ప్రదానం


కత్తెరపల్లె గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని పోలుగారిపల్లె గ్రామానికి చెందిన కత్తెరపల్లె రామిరెడ్డి, చెన్నమ్మ కుమారుడైన కత్తెరపల్లె గోవిందరెడ్డి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి రసాయనశాస్త్రం విభాగంలో డాక్టరేట్ పొందారు. ఈయన ఫిజికో కెమికల్ ప్రాపర్టీస్ ఆఫ్ బైనరీ ఆర్గానిక్ లిక్విడ్ మిక్సర్ త్రూ ఎఫ్‌టీఐఆర్ స్పెక్ట్రల్ అనాలసిస్ అనే అంశంపై యూనివర్సిటీ రసాయనశాస్త్ర విభాగాధిపతి ఆచార్య వై.వి.రామిరెడ్డి పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ సిద్ధాంత గ్రంథాన్ని యూనివర్సిటీకి సమర్పించగా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు.

22న హనుమ జయంత్యుత్సవాలు

బి.కోడూరు : మండలంలోని పెద్దుళ్లపల్లె గ్రామ పంచాయతీ కొండంపల్లె గ్రామంలో వెలసి ఉన్న సువర్చలాదేవి సమేత అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 22వ తేదీన హనుమ జయంత్యుత్సవాల సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు జయరామిరెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటలకు గణపతిపూజ, అభిషేకం, 10–30 గంటలకు శ్రీసువర్చలాదేవి సమేత అభయ ఆంజనేయస్వామి కల్యాణ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

న్యాయం చేయాలని తహసీల్దార్‌కు వినతి


తహసీల్దార్ గంగయ్యకు వినతిపత్రం అందజేస్తున్న రవికుమార్

ప్రొద్దుటూరు : రిటైర్డు అయిన డబ్బులతో తాను 8 సెంట్ల స్థలం కొనగా, ఆ స్థలాన్ని ఆక్రమించారని, తనకు న్యాయం చేయాలని రిటైర్డు మిలటరీ ఉద్యోగి పెట్ల రవికుమార్ శుక్రవారం తహసీల్దార్‌కు గంగయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడతూ కొత్తపల్లె గ్రామ పంచాయతీలోని సర్వే నంబర్ 509/1లో 8 సెంట్ల స్థలాన్ని పాలగిరి అనిల్, నాగులారపు నారాయణలతో కొనుగోలు చేశానని తెలిపారు. ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకోవాలని వెళ్లగా ఆ స్థలం తనదంటూ జరీనా బేగం అనే మహిళ చుట్టు రాతికట్టడం నిర్మించారన్నారు. తన స్థలాన్ని కబ్జా చేయడమేగాకుండా ప్రొద్దుటూరుకు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే తనయుడికి విక్రయించారన్నారు. ఆ స్థలాన్ని వివాదంలోకి నెట్టి మాజీ ఎమ్మెల్యే తనయుడి వద్దకు వెళ్లి పంచాయితీ చేసుకోపొమ్మని తనను భయపెడుతున్నారన్నారు. తనకు స్థలాన్ని అమ్మిన పాలగిరి అనిల్, నాగులారపు నారాయణలను జరిగిన అన్యాయంపై ప్రశ్నిస్తే స్థల వివాదం పెద్ద వాళ్ల చేతిలోకి వెళ్లిందని తామేమి చేయలేమని వారు చెబుతున్నారన్నారు. గత నెల 23న తన 8 సెంట్ల స్థలంలో ప్రెస్‌మీట్ పెట్టి న్యాయం చేయాలని అధికారులను పత్రికా ముఖంగా కోరినట్లు తెలిపారు. అయినా తనకు న్యాయం జరగలేదని, తహసీల్దార్ తన స్థలాన్ని తనకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

చిత్రకళ, హస్తకళలపై నైపుణ్యం సాధించాలి


జయన్న దంపతులను సన్మానిస్తున్న విచారణ గురువులు

కలసపాడు : మండలంలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న చిన్నారులు, విద్యార్థులు చిత్రకళ, హస్తకళలపై నైపుణ్యాన్ని సాధించాలని తెలంగాణ రాష్ట్ర కేంద్రీయ విశ్వవిద్యాలయ ఫైన్‌ఆర్ట్స్ ప్రొఫెసర్ గొల్లపల్లి జయన్న తెలిపారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లి సామెల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ క్యాంపును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విచారణ గురువులు జయన్న దంపతులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలను కార్యసాధకులు కొంత మంది మాత్రమే ఏర్పాటు చేస్తారని, అందులో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌పై మక్కువ కల్పించడం చాలా మెచ్చుకోదగిన విషయమని తెలిపారు. కార్యక్రమంలో లలిత కళావిరామాపింఛం వైస్ ప్రెసిడెంట్ గురయ్య, కార్యకర్త ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వారాహి అమ్మవారికి పూజలు


పూజలో పాల్గొన్న మహిళలు


అమ్మవారికి పూజలు చేస్తున్న రమ్యానంద భారతి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం శ్రీశక్తి పీఠం పీఠాధీశ్వరి మాతా రమ్యానందభారతి స్వామినీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వారాహి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. 102 మంది ఆర్యవైశ్య సుహాసినులతో సుహాసిని పూజ నిర్వహించి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజించారు. సామూహికంగా లలితా సహస్రనామ పారాయణం చేశారు. సాయంత్రం రమ్యానందభారతి స్వామినీ వారాహి దేవి మహత్యంపై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. శని, ఆదివారాల్లో వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు, సుహాసిని పూజలు, ఆరాధనలు, జపహోమాదులు, సాయంత్రం వారాహి దేవిపై ఆధ్యాత్మిక ప్రసంగాలు జరగనున్నాయి. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు కోరారు.

దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పోరుమామిళ్ల : కార్మికుల భవిష్యత్‌కు ప్రమాదకరంగా మారిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఇండస్ట్రీస్, పబ్లిక్ సెక్టార్లను రక్షించాలని కోరుతూ ఈ నెల 20న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం అంబేడ్కర్ భవన్ వద్ద సమ్మె కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భైరవప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చిందని పేర్కొన్నారు. ఈ లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, కాంటాక్ట్ ఔట్ సోర్సింగ్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన హక్కుల సాధన కోసం రైతులు, ఉద్యోగులు, కార్మికులు సమ్మెలో పాల్గొన్నాలని కోరారు. ఉద్యమాలతోనే హక్కులను సాధించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రఫాయిల్, ఓబులమ్మ, నరసింహ, జమాల్, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి


కొండూరు రైతు సేవా కేంద్రంలో యూరియా నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ

అట్లూరు : రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించి, వాటి ఫలితాలకు అనుగుణంగా ఎరువుల యాజమాన్యం చేపడితే మేలైన దిగుబడులు పొందవచ్చని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిదిలోని అట్లూరు, ముత్తుకూరు, కొండూరు రైతు సేవా కేంద్రాలను ఆయన స్థానిక వ్యవసాయ అధికారి జి.రామకృష్ణయ్యతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగులో ఎరువుల వాడకాన్ని తగ్గించి భూసారాన్ని పరిరక్షించడంతో పాటు పెట్టుబడి ఖర్చులను తగ్గించి ఆరోగ్యకరమైన, దిగుబడినిచ్చేలా పంటలు పండించవచ్చన్నారు. అలాగే అట్లూరు మండలంలో కొండూరు, గోపవరం మండల పరిధిలోని బేతాయపల్లి రైతు సేవాకేంద్రాలలో 420 బస్తాలు యూరియా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట రైతు సేవాకేంద్రం హార్టికల్చర్ అసిస్టెంటు రామ్మోహన్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శి సుబ్బరాయుడు ఉన్నారు.

22 పూర్తి.. 10 మిగులు

- లీకేజీలతో నీటి సరఫరాకు అంతరాయం
- ఆధిపత్యపోరుతో ఆగిన పనులు
- తాగునీటికి అవస్థలు పడుతున్న ప్రజలు


తాగునీటి పైపులైన్ లీకేజీని పరిశీలిస్తున్న కార్యదర్శి ధనుంజయ


పైపులైన్ ఉండే ప్రాంతంలో ఇసుక ట్రాక్టర్ వస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కల్లూరు గ్రామంలో తాగునీటి పైపులైన్ ఇసుక ట్రాక్టర్ల ధాటికి లీకేజీ అవుతున్నాయి. గతంలో పాత లీకేజీలకు ఇటీవలే సర్పంచ్ వల్లూరు శివలక్ష్మి నాగేంద్రారెడ్డి 22 చోట్ల మరమ్మతులు చేశారు. అయితే మళ్లీ కొత్తగా 10 చోట్ల లీకేజీలు పడ్డాయి. కల్లూరు గ్రామానికి పెన్నానది నుంచి 2 పైపులైన్ల ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. అయితే పెన్నానది నుంచి నిత్యం వందలాది ట్రాక్టర్లతో ఇసుకను పైపులైన్ ఏర్పాటు చేసిన దారి వెంబడి తరలిస్తున్నారు. దీంతో ఇసుక ట్రాక్టర్ల బరువుకు భూమి కుంగి పైపులైన్ లీకేజీ అవుతోంది. నాలుగు నెలల కింద రూ.10 లక్షల మండల పరిషత్ నిధులు రెండు విద్యుత్ మోటర్లు, పైపులైన్ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు సంబంధించి గ్రామ పంచాయతీ తీర్మానం చేయడంతో కాంట్రాక్టర్‌కు అగ్రిమెంట్ కూడా పూర్తయింది. టీడీపీ నాయకులు ఆ పనులను తాము చేయాలని అధికారుల ద్వారా పనులను నిలుపుదల చేసినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆ పనులను తమ పార్టీ నాయకులే చేస్తారని, లేదంటే పనులు నిలిపేయాలని అధికారులకు గట్టిగా సూచించినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో అధికారులు కూడా నూతన పైపులైన్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదనే ఆరోపణలు వస్తున్నాయి.

కొత్త పైపులైన్ సమస్యకు చెక్

కొత్త పైపులైన్ ఆ రహదారిలో కాకుండా కల్లూరు గ్రామం నుంచి కోగటం వెళ్లే పాత రహదారి వెంబడి ఏర్పాటు చేసేందుకు ప్రజాభిప్రాయం మేరకు తీర్మానం చేశారు. దీంతో కొత్త పైపులైన్ ఏర్పాటు చేస్తే లీకేజీలకు చెక్ పడుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. గురువారం జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి కల్లూరులో తాగు నీటి ఎద్దడి నివారించేందుకు కొత్త పైపులైన్ ఏర్పాటు చేయాలని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈకి సూచించారు. అయినప్పటికీ స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల్లో చలనం లేదు. కాగా పైపులైన్ లీకేజీతో పెద్ద గుంతలు ఏర్పడి మురికి కూపాలుగా మారాయి. విద్యుత్ సరఫరా ఆగినప్పుడు పైపులైన్‌లోకి ఆ మురుగు నీరు చేరి పబ్లిక్ కొళాయిల ద్వారా వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్ కుమార్‌రెడ్డిని ఫోన్ ద్వారా సాక్షి వివరణ కోరగా ఆయన స్పందించలేదు.

జ్వరం వస్తే అశ్రద్ధ చేయొద్దు


ప్రొద్దుటూరు క్రైం : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది


దువ్వూరులో..


ప్రొద్దుటూరు రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా దగ్గరలోని ఆస్పత్రికి వెళ్లి రక్తపరీక్షలు చేయించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని దేవాంగపేట, శ్రీరాములపేట, లైట్ పాళెం అర్బన్ హెల్త్ సెంటర్లలో శుక్రవారం అవగాహన సమావేశం, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తీవ్రమైన తలనొప్పి, కీళ్ల నొప్పులు, డీహైడ్రేషన్, నీరసంగా అనిపించడం లాంటి లక్షణాలు ఉంటే డెంగీ వ్యాధిగా పరిగణించాలని చెప్పారు. వైద్యాధికారులు అలీం దౌలా, భరత్, మౌనిక, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, హెచ్ఈఓ సుబ్బరాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనివాసనగర్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో..

స్థానిక శ్రీనివాసనగర్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. సీఓ నాగజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

టీబీరోడ్డు యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో..

టీబీరోడ్డు యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీరోడ్డులో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి హిమబిందు, హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, సీఓ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే డెంగీ నివారణ

దువ్వూరు : పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీని నివారించవచ్చని దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ వ్యాధి దినోత్సవం సందర్భంగా డాక్టర్లు, వైద్య సిబ్బంది పీహెచ్‌సీ నుంచి దువ్వూరు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు వికసిత, రోషిణి, హేమలత మాట్లాడుతూ ప్రజలు డెంగీ వ్యాధి బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఆప్తమాలిక్ ఆఫీసర్ చంద్రమౌళి, హెల్త్ సూపర్‌వైజర్లు రాజగోపాల్, సువర్ణ, వీరాంజనేయులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దోమల నివారణతో డెంగీ దూరం

చాపాడు : దోమలు పుట్టకుండా జాగ్రత్తలు తీసుకుని నివారించడం వలన డెంగీ వ్యాధి దూరమవుతుందని మండల వైద్యాధికారి డా.రాజేష్‌కుమార్ పేర్కొన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ దోమల వ్యాప్తి జరుగకుండా ప్రజలు తీసుకోవాల్సిన చర్యలను వైద్య సిబ్బంది తెలియజేయాలన్నారు. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చేసుకోవడం ద్వారా దోమలు పుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారులు డా.కావ్య మాధురి, డాక్టర్ ఓబులేసు, హెల్త్ సూపర్‌వైజర్ బాబురెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు నారాయణరెడ్డి, రమేష్‌తదితరులు పాల్గొన్నారు.

బి.కోడూరు : జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది బి.కోడూరు గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, దోమలార్వా నియంత్రణ, డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా వంటి జబ్బుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.కంటి వైద్యాధికారి హుసేనయ్య, సూపర్‌వైజర్ జాన్‌విలియం, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : దోమల నివారణతో డెంగీని దూరం చేయవచ్చని, ఇందుకోసం ప్రతిఒక్కరూ దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలని వైద్యాధికారులు డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఎన్‌జీవో హోమ్ నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించి అనంతరం ఎన్‌జీవో హోమ్‌లో డెంగ్యూ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాత్రి వేళల్లో దోమతెరలు వాడాలని సూచించారు. సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి, వైద్యాధికారులు డాక్టర్ శరత్‌చంద్ర, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ సౌమ్య, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

డెంగీ నివారణకు కృషి చేయాలి

ప్రొద్దుటూరు రూరల్ : డెంగీ నివారణకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శివప్రసాద్ రెడ్డి తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా కామనూరు, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని చౌటపల్లె, కల్లూరు గ్రామాల్లో డెంగ్యూ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, కామనూరు, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ హనీఫ్‌బాబా, డాక్టర్ మహాలక్ష్మి, ఆప్తాలమిక్ ఆఫీసర్ తేజ, సీహెచ్ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్లు బీపీ వరప్రసాద్, ఎంపీహెచ్ఈఓ రాజశేఖర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.